సాక్షి పల్నాడు

గురువారం । 17 । జూలై । 2025



నరసింహస్వామి హుండీ ఆదాయం

కర్లపాలెం: అల్లూరు గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2,17,253 వచ్చినట్లు ఈఓ ఎంవి.శ్రీనివాసవర్మ బుధవారం తెలిపారు.



కురిసింది వాన

తాడికొండ: దాదాపు నెలకుపైగా ముఖం చాటేసిన వరుణ దేవుడు ఎట్టకేలకు కరుణించాడు. బుధవారం తాడికొండలో కురిసిన భారీ వర్షం అందరికీ ఊరటనిచ్చింది.



దుర్గమ్మ హుండీ ఆదాయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు హుండీల ద్వారా రూ.4,37,16,236 నగదు, 395 గ్రాముల బంగారం, 9.614 కిలోల వెండి సమకూరాయని ఈఓ శీనానాయక్ తెలిపారు.

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

పోస్టర్ ఆవిష్కరించిన మెంబర్ సెక్రటరీ, రోడ్డు సేఫ్టీ ప్రతినిధులు



నరసరావుపేట: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేస్తామని రోడ్డు సేఫ్టీ మెంబర్ సెక్రటరీ, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.గీతారాణి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా రహదారి భద్రతా కమిటీ రూపొందించిన 'థింక్ రోడ్డు సేఫ్టీ' పోస్టర్‌ను బుధవారం ఆర్అండ్‌బీ కార్యాయంలో రోడ్డు సేఫ్టీ అధ్యక్షురాలు దుర్గాపద్మజ, సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమెను రోడ్డుసేఫ్టీ ఎన్‌జీఓ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈసందర్భంగా గీతారాణి మాట్లాడుతూ సుప్రీంకోర్టు కమిటీ ఆన్ రోడ్ సేఫ్టీపై ఇచ్చిన ఆదేశాలు తప్పకుండా పాటిస్తామన్నారు. రోడ్డు సేఫ్టీ ఎన్జీఓ తరఫున ఇచ్చే సూచనలు కూడా పరిగణలోకి తీసుకుని కమిటీలో చర్చించటం జరుగుతుందన్నారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచనల మేరకు జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు కృషిచేస్తామని అన్నారు. ఎన్‌జీఓ సభ్యులు బంగారయ్య పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



నరసరావుపేటరూరల్: అల్లూరివారిపాలెం రోడ్డులోని లింగంగుంట్ల చెక్‌పోస్ట్ సమీపంలోని మానసాదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రీ వాసవి మిత్రమండలి అధ్యక్షులు చేగు వెంకటేశ్వరరావు దంపతులు, నేరేళ్ల విజయలక్ష్మి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

ఉద్యోగం నుంచి వార్డెన్ తొలగింపు


కారెంపూడి: స్థానిక మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ ఇన్‌ఛార్జి వార్డెన్ శౌరీ భాయిని ఉద్యోగ విధుల నుంచి తప్పించినట్లు డీఈఓ ఎల్.చంద్రకళ ఆదేశాలు జారీ చేశారని ఎంఈఓ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డెన్‌పై వచ్చిన అభియోగాలు నిజమని కమిటీ విచారణలో తేలడంతో ఆమెను ఉద్యోగం నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో ఎంతో బాధ్యతగా ఉండాలని ఎలాంటి నిర్లక్ష్యాన్ని, అభ్యంతకర ప్రవర్తనను ఉపేక్షించేది లేదని ఎంఈఓ రవికుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

558.70 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జుసాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం 558.70 అడుగులకు చేరింది. ఇది 229.3671 టీఎంసీలకు సమానం .సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,650 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 65,900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

3 వేల కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



పొన్నూరు: పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణంలో బుధవారం మున్సిపల్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాదాపు మూడు వేల కిలోల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం 21 వార్డులోని ఓ ట్రేడర్స్‌లో విక్రయానికి ఉంచిన ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. యజమానికి రూ. 10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

న్యాయం మృగ్యం

వినుకొండలో రషీద్ హత్యకు నేటితో ఏడాది

- నడిరోడ్డుపై విచక్షణారహితంగా నరికిన టీడీపీ కార్యకర్త జిలానీ
- కూటమి నేతల ఒత్తిడితో ఇద్దరు టీడీపీ ముఖ్య నేతల పేర్లు ఎఫ్ఐఆర్‌లో చేర్చని పోలీసులు
- ఛార్జిషీట్‌లో మరో నలుగురు టీడీపీ కార్యకర్తల పేర్లు తొలగింపు
- కేసులో ఏ1 జిలానీ తప్ప అందరూ బెయిల్‌పై బయట తిరుగుతున్న వైనం
- రషీద్ కుటుంబ సభ్యులు, సాక్షులను బెదిరించి కేసు రాజీకి ఒత్తిడి
- రషీద్ సోదరుడి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం తొలగింపు .. తప్పుడు కేసు నమోదు



ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమణి లీలావతికి కేక్ తినిపిస్తున్న నిందితుడు జిలానీ (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వినుకొండకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రషీద్ హత్య జరిగి నేటికి సరిగ్గా ఏడాది పూర్తవుతుంది. గతేడాది జూలై 17వ తేదీ రాత్రి తెలుగుదేశం పార్టీ గుండాల చేతిలో రషీద్ బలయ్యాడు. కేసులో ఏ1 నిందితుడు షేక్ జిలానీ నడిరోడ్డుపై ప్రజలంతా చూస్తుండగానే అత్యంత పాశవికంగా రషీద్‌ను నరికి చంపేశాడు. హత్య చేసింది టీడీపీ కార్యకర్తలు కావడంతో కూటమి ప్రభుత్వం కేసును నీరుగార్చేందుకు యత్నిస్తోందని మృతుడు రషీద్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతుడి రక్తసంబంధీకులు ఇచ్చిన ఫిర్యాదులోని నిందితుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చకుండా నామమాత్రంగా కొందరిని అరెస్టు చేసి చేతులు దులుపుకొన్నారన్న విమర్శలు బాధిత కుటుంబం నుంచి వినిపిస్తున్నాయి.

సూత్రధారులను వదిలేశారు

హత్య జరిగిన రోజే రషీద్ సోదరుడు ఖాదర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదులో రషీద్ మరణానికి కారణంగా పేర్కొంటూ వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వినుకొండ మున్సిపాలిటీకి చెందిన కీలక టీడీపీ నేతలు షమీమ్‌ఖాన్, అయూబ్‌ఖాన్, హంతకుడు జిలానీ స్నేహితులైన కొందరు టీడీపీ రౌడీల పేర్లు ప్రస్తావించారు. అయితే పోలీసులు కేవలం హత్యలో పాల్గొన్న కొందరు టీడీపీ గుండాల పేర్లు మాత్రమే పొందుపరచి, హత్యకు కుట్రపన్నిన ప్రాజాప్రతినిధులు, పట్టణ టీడీపీ ముఖ్యనేతల పేర్లు తొలగించారు. దీనిపై తొలిరోజు నుంచి రషీద్ కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షమీమ్‌ఖాన్, అయూబ్‌ఖాన్‌లను ఎఫ్ఐఆర్‌లో చేర్చాలన్న డిమాండ్‌ను పోలీసులు పట్టించుకోలేదు. రషీద్ హత్యకు కథ, స్క్రీన్‌ప్లే మొత్తం షమీమ్, అయూబ్‌ఖాన్‌లే రచించారనదే వారి వాదన. హత్యకు కుట్ర పన్నిన వారిని పక్కకు తప్పించి.. వ్యక్తిగత కక్షల నేపథ్యంలో జరిగిన హత్యగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోతున్నారు.



రషీద్ కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు (ఫైల్)

రషీద్ కేసులో సాక్షులను బెదిరించి కేసును నీరుగార్చేలా వినుకొండ టౌన్ పోలీసులు వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగా వినుకొండ పట్టణ పరిధిలో 2022 జూలై 10వ తేదీన జరిగిన ఓ గొడవకు సంబంధించిన పాత కేసులో కొత్త సెక్షన్లు చేర్చి వైఎస్సార్ సీపీ నేతలు, రషీద్

సాక్షులకు వేధింపులు

సోదరుడు ఖాదర్‌లను ఈ ఏడాది జనవరిలో రిమాండ్‌కు పంపారు. రషీద్ మర్డర్ కేసు నుంచి బయటపడటంతో పాటు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్న మైనార్టీలను భయపెట్టాలన్న ఉద్దేశంతో కూటమి నేతల అండదండలతో రషీద్ హత్య కేసు నిందితులు కొత్త ప్లాన్ అమలు చేశారు. ఇందుకు పోలీసుల సహాయం లభించడంతో అక్రమ సెక్షన్లు బనాయింపు, కేసులో సంబంధం లేని వారిని చేర్చడం చకచకా జరిగిపోయాయి. ఏకంగా 30 మందిని జైలుపాలు చేశారు. ఎలాగైనా రషీద్ కేసులో రాజీ పడాలన్న ఉద్దేశంతోనే అక్రమ కేసులు, బెదిరింపులకు పాల్పడుతున్నట్టు రషీద్ కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

మరో నలుగురి పేర్లు తొలగింపు

రషీద్ హత్య కేసులో ప్రధాన నిందితుడు జిలానీ ప్రస్తుతం జైలులో ఉన్నాడు. మిగిలిన వారు బెయిల్‌పై బయటకు వచ్చి సాక్షులను బెదిరిస్తున్నారని రషీద్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల వినుకొండ టౌన్ పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో ఎఫ్ఐఆర్‌లో ఉన్న నిందితులు ఏ1 జిలానీ సోదరుడు జిమ్ జానీ, షేక్ షఫీ, ఇమ్రాన్, పొట్లపాడు సాయిబాల పేర్లు తొలగించారు. అధికారపార్టీకి చెందిన వీరిని కేసులో నుంచి బయటపడేసేందుకు టీడీపీకి అనుకూలంగా ఉన్న నలుగురు సాక్షులను పోలీసులు చేర్చి, వారి వాంగ్మూలం ఆధారంగా ఈ నలుగురు నిందితుల పేర్లు తొలగించారని రషీద్ కుటుంబ సభ్యులు, న్యాయవాదులు వాపోతున్నారు. దీనిపై రషీద్ కుటుంబ సభ్యులు కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నారు.

బెదిరిస్తున్నారు..



టీడీపీ రౌడీమూకలు నా బిడ్డ రషీద్‌ను నడిరోడ్డుపై పాశవికంగా నరికి చంపేశారు. రషీద్ కేసులో అసలు దోషులను కేసులో లేకుండా తప్పించారు. నా కొడుకు మృతికి కారణమైన వారికి శిక్షపడుతుందని నమ్మకం లేకపోగా మరో కొడుకు ఖాదర్‌ను కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా ఇబ్బందికి గురిచేస్తోంది. విద్యుత్ శాఖలో దశాబ్దానికి పైగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం నుంచి తొలగించారు. అది చాలదన్నట్టు అక్రమ కేసులో ఇరికించి జైలుకు పంపారు. కేసు రాజీ చేసుకోవాలని నా కొడుకు, ఇతర సాక్షులను బెదిరిస్తున్నారు.

– బడేబీ, రషీద్ తల్లి, వినుకొండ

రషీద్ హంతకులకు శిక్ష పడాల్సిందే ..



రషీద్ హత్య కేసు నిందితులకు శిక్షపడేలా చేయడానికి వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ తరఫున కృషి చేస్తున్నాం. పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు. నిందితులకు అండగా నిలుస్తున్నారన్న భావన కనిపిస్తోంది. నలుగురిని సరైన ఆధారాలు లేవన్న సాకుతో ఛార్జిషీట్ నుంచి తొలగించారు. దీనిపై కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నాం.

– ఎంఎస్ ప్రసాద్, సీనియర్ అడ్వకేట్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి

రషీద్ కుటుంబానికి వైఎస్ జగన్ అండ

టీడీపీ గూండాల చేతిలో దారుణంగా హత్యకు గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది జూలై 19వ తేదీన వినుకొండకు వచ్చారు. బిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులకు మనోధైర్యం చెప్పారు. రషీద్ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని దేశ రాజధాని వేదికగా వైఎస్ జగన్ నిలదీశారు. ఆ కుటుంబానికి న్యాయం చేకూర్చేవిధంగా వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులను పంపి పోరాటం చేయిస్తున్నారు. వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆ కుటుంబానికి అండగా నిలిచి న్యాయపోరాటానికి అవసరమైన నైతిక మద్దతును అందిస్తున్నారు.

దగాపై రగిలిన రైతన్న

- బేలుకు రూ.3వేలు మాత్రమే ఇస్తామంటున్న బయ్యర్లు
- ఇష్టమైతే అమ్మండి.. లేదంటే పొండంటూ బెదిరింపులు
- పొగాకు బేళ్లను రోడ్డుపై వేసి ప్రభుత్వ తీరుపై నిరసన
- ప్రభుత్వం మోసం చేసిందని రైతుల మండిపాటు
- ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసుల దురుసు ప్రవర్తన

పొగాకుకు గిట్టుబాటు ధర కోరుతూ హైవే దిగ్బంధనం



ధర్నా చేస్తున్న రైతులతో దురుసుగా ప్రవర్తిస్తున్న పోలీసులు

దాచేపల్లి: ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వ తీరుపై రైతులు మండిపడ్డారు. పొగాకుకు కనీస గిట్టుబాటు ధర కల్పించడం లేదంటూ ప్రభుత్వం తీరును ఎండగడుతూ రోడ్డెక్కారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం, గామాలపాడు గ్రామ పరిధిలోని వేర్‌హౌస్ గోడౌన్స్ వద్ద అద్దంకి –నార్కెట్ పల్లి రహదారిపై పొగాకు రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. పొగాకు ఉత్పత్తులను రోడ్డుపై వేసి, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సవాలక్ష ఆంక్షలు

పొగాకు రైతులు తమ ఉత్పత్తులను గామాలపాడులోని వేర్‌హౌస్ గోడౌన్‌కు తేవాల్సిందిగా సంబంధిత బయ్యర్లు, సూపర్‌వైజర్లు సమాచారం ఇచ్చారు. వీరి సమాచారం మేరకు జిల్లావ్యాప్తంగా ఉన్న పొగాకు రైతులు తమ ఉత్పత్తులతో అక్కడికి చేరుకున్నారు. అయితే తాజాగా తీసుకొచ్చిన పొగాకు నాసిరకంగా ఉందని, రూ.3వేలకు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం.. అంతేకాకుండా ఒక రైతు నుంచి ఒకటి, రెండు బేళ్ల పొగాకు మాత్రమే కొంటామని చెప్పి, మిగతావి నాసిరకంగా ఉన్నాయని చెప్పి తిరస్కరించడంతో రైతులు ఆగ్రహించారు. బయర్ల తీరును నిరసిస్తూ పక్కనే ఉన్న హైవేపై ఆందోళనకు దిగారు. రైతుల ఆందోళనలతో హైవేపై భారీస్థాయిలో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

రైతులతో దురుసు ప్రవర్తన

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులతో పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. రైతులతో సీఐ భాస్కర్, ఎస్ఐలు పాపారావు, సౌందర్యరాజన్‌లు దురుసుగా మాట్లాడి బలవంతంగా అక్కడి నుంచి లేపారు. పోలీసుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బయ్యర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు ప్రయత్నించగా.. బయ్యర్లు తమ పరిధిలో ఏమీ లేదని చేతులెత్తేశారు.

రైతులతో అధికారుల చర్చలు



గోడౌన్ వద్దకు రైతులు తెచ్చిన పొగాకు బేళ్లు

దాచేపల్లి: గిట్టుబాటు ధర కల్పించాలని ఆందోళన చేపట్టిన రైతులతో అధికారులు చర్చించారు. రైతుల ఆందోళన విషయం జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ, దాచేపల్లి తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలులు గామాలపాడు చేరుకుని రైతులతో మాట్లాడారు. గతంలో ఇచ్చిన ధర, ప్రస్తుతం ఇస్తున్న ధరల వ్యత్యాసంపై రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. తాము తీసుకువచ్చిన పొగాకు అంతటిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులు కోరారు. గాడ్ ఫ్రై ఫిలిప్స్ ఇండియా కంపెనీ ప్రతినిధులతో అధికారులు మాట్లాడారు. సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మురళీకృష్ణ రైతులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


తగలబెట్టడం తప్ప మరో మార్గం లేదు



ఎంతో కష్టపడి పొగాకు పంటను పండించాం. గిట్టుబాటు ధర కల్పించి కొంటామని మాతో చెప్పారు. తీరా పంట దిగుబడి వచ్చిన తర్వాత విక్రయించేందుకు వస్తే నాణ్యంగా లేదని.. అంత బాగోలేదని రకరకాలుగా వంకలు చెబుతూ పంట కొనుగోలు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఇప్పుడు కొనకపోతే పంటను తగలబెట్టడం తప్ప మాకు మరో మార్గం లేదు.

– కళ్ళం నారాయణరెడ్డి, శిరిగిరిపాడు


రైతులను చంపేయండి



పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులను చాలా ఇబ్బంది పెడుతున్నారు. 75 కేజీలు 85 కేజీలు ఉండే బేల్‌కు రూ.3వేలు మాత్రమే ఇస్తామని చెప్తున్నారు. ఇంత దారుణమైన ధర ఇంతవరకు నేను చూడలేదు. పెట్టుబడి ఖర్చులే రూ.లక్షన్నర పైగా అయ్యాయి. ఈ రేటుతో మేం ఎలా బతకాలి.. అప్పులు ఎలా తీర్చాలి? పొగాకు పంటకి గిట్టుబాటు ధర ఇవ్వలేకపోతే రైతన్నలను చంపేయండి.

– సయ్యద్ మోదిన్, వేమవరం

హీనంగా చూస్తున్నారు



పొగాకు రైతులను అధికారులు , బయ్యర్లు హీనంగా చూస్తున్నారు. కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా అవమానకరంగా మాట్లాడుతున్నారు. మేం ఇచ్చేది ఇంతే మీ ఇష్టమైతే అమ్మండి.. లేదంటే తీసుకెళ్లండని నిర్మొహమాటంగా చెబుతున్నారు. నేను శిరిగిరిపాడు నుంచి పొగాకు ఇక్కడికి తెచ్చాను. నాకు ఖర్చు రూ. 6వేలు వచ్చింది. నేను తెచ్చిన వాటిల్లో రెండే బేళ్లు కొంటామని మిగతావి వెనక్కి తీసుకెళ్లాలని చెబుతున్నారు. ఇప్పుడు ఈ ఖర్చులన్నిటినీ మేం ఎలా భరించాలి?

– లింగిరెడ్డి కృష్ణారెడ్డి, శిరిగిరిపాడు

ఉపాధి కూలీలకు డబ్బులు వేస్తాం

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్

రాజుపాలెం: ఉపాధి కూలీలకు త్వరలో డబ్బులు వేస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించి, కొన్ని కార్యాలయాలలో ఆకస్మికంగా బుధవారం తనిఖీలు నిర్వహించారు. బ్రాహ్మణపల్లిలో గల రైతు గుర్రాల జగన్ పొలంలో ఉపాధి హామీ పథకం ద్వారా తీసిన పంట కుంటలను పరిశీలించారు. అక్కడ వేసి ఉన్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉపాధి కూలీలు కలెక్టర్‌తో మాట్లాడుతూ మాకు ఒక్క వారం మాత్రమే కూలి డబ్బులు పడ్డాయి. మిగిలినవి ఇంతవరకు డబ్బులు పడలేదని తెలిపారు. ఉదయం 7 గంటలకు వచ్చి 11 గంటల వరకు పనిచేస్తున్నామని, కూలీ రేటు పెంచాలని కలెక్టర్‌కు వివరించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ త్వరలో డబ్బులు వేస్తామని, మీరు అధైర్య పడవద్దని ఉపాధి కూలీలకు హామీ ఇచ్చారు. తొలుత అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను సందర్శించారు. సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి, డీఈఓ చంద్రకళ, డ్వామా పీడీ ఎం.సిద్ధలింగమూర్తి, ఏపీడీ పొత్తూరి వెంకట నారాయణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ సింగయ్య, తహసీల్దార్ దుర్గేష్‌రావు, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, ఎంఈఓ 1, మల్లిఖార్జునశర్మ, ఎంఈఓ – 2 నరసింహారావు, విద్యుత్ ఏఈ కోటా పెదమస్తాన్‌రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీ–4పై అపోహలు తొలగించండి

నరసరావుపేట: పీ–4 కార్యక్రమంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని నియోజక వర్గాల విజన్ యాక్షన్‌ప్లాన్ యూనిట్ల సిబ్బందిని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. దీనిలో భాగస్వాములైతే ఇతర ప్రభుత్వ పథకాలకు దూరం అవుతామేమో అనే బంగారు కుటుంబాలు, మార్గదర్శకులలోనూ నెలకొన్న అభద్రతాభావం తొలగించాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పీ4, జనాభా నిర్వహణపై నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,600

మోడల్ ధర రూ. 1,300

మిర్చి యార్డు సమాచారం

(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	55,232
అమ్మకాలు	53,535
నిల్వ	9,175

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-13,400
సూపర్-10	10,000-13,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,600
నంబరు-5	10,000-13,500
341	10,000-13,500
4884	10,000-12,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,800
షార్క్-1	10,000-12,200
బాడిగ-355	10,000 - 12,300
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 10,800
తాలుకాయలు	5,000 - 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,600
బాడిగ - 355	10,000-12,600
దేవనూరు డీలక్స్	10,000-12,500
తాలు	5,200 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)

పెండింగ్ కేసులకు సత్వర పరిష్కారం

- సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి
- నరసరావుపేటలో మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ



నరసరావుపేటలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

నరసరావుపేట టౌన్: కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వానిది కీలక పాత్ర అని సీనియర్ సివిల్ జడ్జి కె.మధుస్వామి అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు బుధవారం న్యాయస్థానం భవనాల నుంచి మల్లమ్మ సెంటర్ వరకు మధ్యవర్తిత్వం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కె. మధుస్వామి మాట్లాడారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దావాలను మధ్యవర్తిత్వం ద్వారా లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. దీని ద్వారా ఇరుపక్షాలకు లాభం చేకూరుతుందన్నారు. మొదట న్యాయవాద సంఘ కార్యాలయంలో న్యాయవాదులకు మీడియేషన్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా కోర్టు ఆవరణలో మీడియేషన్‌కు సంబంధించి రూపొందించిన కరపత్రాల స్టాల్ ఏర్పాటు చేసి కక్షిదారులకు పంపిణీ చేశారు. అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ, న్యాయమూర్తులు ఆర్.ఆశీర్వాదం పాల్, ఎ.సలోమి, ఎం.గాయత్రి, న్యాయవాద సంఘ అధ్యక్షుడు జి.వి.సుబ్బారావు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఎం.ఎల్.ఎస్.సి సభ్యులు, మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్, న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజమార్గమని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులకు సుప్రీం కోర్టు ప్రవేశపెట్టిన మధ్య వర్తిత్వం ద్వారా పరిష్కారం లభిస్తుందని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యాయమూర్తి విజయ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కేసులకు సంబంధించి ఉభయపక్షాలు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం కోరినట్లయితే ఆ కేసును వెంటనే పరిష్కారం చేసుకునేందుకు వీలుందన్నారు. సత్తెనపల్లి కోర్టులో నూతనంగా మధ్యవర్తిత్వం కమిటీని నియమించామని, ఈ కమిటీ ప్రతిరోజు కోర్టు ఆవరణలో ఉండి పెండింగ్‌లో ఉన్న కేసులును పరిష్కారం చేస్తారన్నారు. సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషీద్ హుస్సేన్, మొదటి అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పి. ప్రియదర్శిని, రెండవ అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) జె. సృజన్ కుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.అజయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ చిన్నం మణిబాబు, గవర్నమెంట్ ప్లీడర్లు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్స్, కోర్టు సిబ్బంది, న్యాయవాద గుమస్తాలు, పోలీసులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న జడ్జి విజయ్ కుమార్‌రెడ్డి, న్యాయమూర్తులు, న్యాయవాదులు

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ

మాచర్ల: మండల న్యాయ సేవా కమిటీ మాచర్ల ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై అవగాహన కోసం బుధవారం మాచర్ల కోర్టు నుంచి ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.రమేష్ బాబు, ప్రభుత్వ న్యాయవాది జి.వెంకటేశ్వర్లు అవగాహన ర్యాలీని ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు సాధ్యమైనంత వరకు రాజీపడదగిన కేసులను వెంటనే రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. న్యాయవాదులు జి.సత్యనారాయణ రెడ్డి, గంగుల శ్రీనివాసరావు, పి.అనిల్, వి.పుల్లారావు, శేషిరెడ్డి, గౌస్ బాషా, మాచర్ల పట్టణ ఇన్‌స్పెక్టర్, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, మండల న్యాయ సేవా కమిటీ సభ్యులు మెట్టు గోవింద్ రెడ్డి, వివిధ పాఠశాలల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

రైతులను గాలికొదిలి కిసాన్ మేళాలా?

గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల: దాచేపల్లి పట్టణంలో కిసాన్ మేళా పెట్టి ఎవరికి న్యాయం చేస్తారో చెప్పాలని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రశ్నించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పొగాకు రైతులు మద్దతు ధరకల్పించాలని ఆందోళన చేస్తే వారిపై పోలీసులను పెట్టి దాడి చేయించటం, బెదిరించటం చేశారన్నారు. పత్తికి గిట్టుబాటు ధర లేక రైతులు ఆందోళన చెందుతుంటే ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్నారు. వీళ్లు మళ్లీ మేళాలు పెట్టి ఎవరికి న్యాయం చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

నడికుడి యార్డును పట్టించుకునే నాథుడేడీ?

దాచేపల్లిలో పత్తి కొనుగోలు కేంద్రంతోపాటు, మిర్చి కొనుగోలు కేంద్రాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మొదటిసారిగా తీసుకొని వచ్చామన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు వలే అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రెండు సంవత్సరాలు అదేవిధంగా కొనుగోలు సాగిందన్నారు. కూటమి వచ్చిన ఏడాది నుంచి ఆ కొనుగోలు కేంద్రానికి దిక్కుమొక్కులేదన్నారు. తక్షణమే నిధులు సేకరించి గుంటూరు మార్కెట్ యార్డుకు ధీటుగా నడికుడి మార్కెట్ యార్డును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ, మండల కన్వీనర్‌లు మాదాల కిరణ్‌కుమార్, చింతా సుబ్బారెడ్డి, మాజీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతు నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్



పిడుగురాళ్ల: పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకుండా రైతుల నడ్డి విరుస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ... రైతులను చులకన భావంతో చూస్తూ పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలని పేర్కొన్నారు. దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామం వద్ద పొగాకు ఉత్పత్తులను అమ్ముకునేందుకు రైతులు వస్తే పోలీసులు పంట ఉత్పత్తులను బూటు కాళ్లతో తన్నడం ఘోరమన్నారు. కూటమి సర్కారులో రైతులకు విలువ లేకుండా పోయిందన్నారు. దూర ప్రాంతాల నుంచి రైతులు పొగాకు బేళ్లను తీసుకొస్తే వాటిని కొనుగోలు చేయకుండా, ఇబ్బంది పెడుతున్నారని, బేళ్ల రైతు ట్రాన్స్‌పోర్టు వాహనం ద్వారా ఇక్కడికి తెచ్చుకుంటే కేవలం ఒకటి రెండు బేళ్లను మాత్రమే కొనుగలు చేసి, మిగిలినవాటిని కొనుగోలు చేయకుండా పంపిస్తున్నారని ఇది దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల వద్ద నున్న పొగాకు పంట ఉత్పత్తుల మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

మెట్టభూముల్లో సాగు సఫలం

- జిల్లాలో డ్రైలాండ్ హార్టికల్చర్‌కు శ్రీకారం
- 19 రకాల పండ్ల మొక్కలు నాటేందుకు అవకాశం

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రైతులకు చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. ఇందులో భాగంగా మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకం (డ్రైలాండ్ హార్టికల్చర్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీని ద్వారా రైతుల భూముల్లో మామిడి, జీడి మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, తైవాన్ జామ, కొబ్బరి, సపోట, చింత, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, అంజీర, ఆపిల్ బేర్, గులాబీ తోట, మల్లెతోట, మునగ, పామాయిల్, డ్రాగన్ ఫ్రూట్ .. ఇలా 19 రకాల పండ్ల మొక్కలు పెంచుకోవడానికి వీలుంది. ఈ పంటలకు మూడేళ్ల పాటు ఎకరాకు సగటున రూ.లక్ష చొప్పున ప్రోత్సాహం అందిస్తారు. ఏటా ఈ నగదును రైతుల ఖాతాలకు జమ చేస్తారు.

జిల్లాలో 3,500 ఎకరాల్లో...

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 28 మండలాల్లోని 3,500 ఎకరాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఇప్పటికే 390 మంది రైతులకు సంబంధించి 631.02 ఎకరాల్లో సాగుకు పండ్ల మొక్కలు నాటారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసే దిశగా ఉపాధి హామీ సిబ్బంది రైతుల్లో చైతన్యం కల్పిస్తున్నారు.

అవకాశాన్ని ఉపయోగించుకోవాలి



పండ్ల తోటలు వేసుకునే రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా సాయం అందు తుంది. సేద్యంలో మెలకువలతో ముందుకు సాగితే మంచి ఫలితాలు వస్తాయి. ఆసక్తి ఉన్న రైతులు గ్రామాల్లోని క్షేత్ర సహాయకులకు దరఖాస్తులు ఇస్తే మంజూరు ప్రక్రియను పూర్తి చేస్తాం.

– పి.వెంకటనారాయణ, ఏపీడీ, సత్తెనపల్లి

సమస్యలపై స్పందించకపోవడం దారుణం

నాలుగో రోజుకు చేరిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె



సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న గోపాలరావు

నరసరావుపేట: జీఓ నంబరు 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులందరికీ జీతాలు పెంపుదల చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారంతో నాలుగోరోజుకు చేరింది. వారికి మద్దతుగా సీఐటీయూ పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో చేరారు. కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన సమ్మె శిబిరాన్ని గోపాలరావు, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి రెడ్‌బాష సందర్శించి తమ సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులు గత నాలుగురోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదన్నారు. అత్యవసర సేవల రంగం పేరుతో 24 గంటలు పనిచేయించుకుంటున్న ప్రభుత్వం అదే రీతిలో అత్యవసరంగా వారితో చర్చలు నిర్వహించి సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఒకమాట.. ఎన్నికల తర్వాత మరోమాట మాట్లాడి కార్మికులను నిర్లక్ష్యం చేయటం తగదన్నారు. సీఐటీయూ నాయకులు శిలార్ మసూద్, చిన్న అల్లాభక్షు, కార్మికులు పాల్గొన్నారు.

అదనపు జిల్లా కోర్టు ఏపీపీ రాజీనామా

నరసరావుపేట టౌన్: 13వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా పత్రాన్ని నరసరావుపేట 13వ అదనపు జిల్లా న్యాయమూర్తికి సమర్పించినట్లు తెలియవచ్చింది. అదేవిధంగా ప్రాసిక్యూషన్ ఆఫ్ డైరెక్టర్‌కు రాజీనామ లేఖను పోస్ట్ ద్వారా పంపారు. రాష్ట్రవ్యాప్తంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన ఏపీపీలు, ఏజీపీలను తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించాలనే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో మల్లారెడ్డి తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. ఆయన రాజీనామాతో టీడీపీకి చెందిన న్యాయవాదుల్లో పలువురు ఆశావాహులు ఏపీపీ పోస్టు కోసం పోటీ పడుతున్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు శివసాకేత్



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి 10వ జూనియర్స్ స్విమ్మింగ్ పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి కె.శివసాకేత్ ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు బుధవారం తెలిపారు. గుంటూరు శ్యామలానగర్‌లోని ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన ఉమ్మడి గుంటూరుజిల్లా స్విమ్మింగ్ టీమ్ ఎంపిక పోటీల్లో శివసాకేత్ పాల్గొని 50, 100, 200 మీటర్ల బటర్ ఫ్లై, 200, 400 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగాలకు ఎంపికైనట్టు వివరించారు. విశాఖపట్నంలో ఈనెల 19, 20 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో శివసాకేత్ ఉమ్మడి గుంటూరుజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, కోచ్ జి.సురేష్, అధ్యాపకులు శివసాకేత్‌ను అభినందించారు.

కసాయి తండ్రి అరెస్టు

క్రోసూరు: మండలంలోని యర్రబాలెం గ్రామంలో ఈనెల 3వ తేదీన కన్నకొడుకును హత్యచేసిన నిందితుడు బూక్యా వెంకటేశ్వర్లు నాయక్‌ను మంగళవారం అరెస్ట్ చేసి, బుధవారం కోర్టులో హాజరుపరచినట్లు ఎస్‌ఐ రవిబాబు తెలిపారు. కోర్టు రిమాండ్ విధించినట్లు తెలియచేశారు. అచ్చంపేట మండలం పుట్లగూడెంకు చెందిన నిందితుడు నేరచరిత్ర కలిగినవాడిగా , పలుహత్యలు చేసినట్లు భార్య కోటేశ్వరీబాయి సంఘటన ప్రదేశంలో మీడియా ఎదుట ఆరోపించటం సంచలన కలిగించిన విషయం విధితమే.

నా భార్య కారణంగానే చనిపోతున్నా..

సెల్ఫీ వీడియో తీసుకొని యువకుడు ఆత్మహత్య



బ్రహ్మయ్య (ఫైల్)

తాడేపల్లి రూరల్: తన చావుకు భార్య కారణమని పేర్కొంటూ ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం... తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటకు చెందిన బ్రహ్మయ్య (30) సీసీ కెమెరాల టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళగిరి టిడ్కో నివాసాల్లో ఉంటున్న యువతితో వివాహం జరిగింది. ఆమె ప్రవర్తన సరిగ్గా లేదని పుట్టింటికి పంపించేశాడు. అందరూ బ్రహ్మయ్యను బతిమిలాడితే ఆమెను కాపురానికి తీసుకొచ్చినట్లు బంధువులు తెలిపారు. అత్తాకోడళ్ల గొడవల కారణంగా బ్రహ్మయ్య సొంత ఇంటి నుంచి ఉండవల్లి అమరావతి రోడ్‌లోని ఒక ఇంటిలో అద్దెకు దిగాడు. అక్కడ మళ్లీ ఆమె ఫోనులో ఎక్కువగా మాట్లాడుతుండటంతో గొడవలు జరిగాయి. ఈలోగా ఆషాఢ మాసం రావడంతో పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో తన చావుకు భార్య కారణం అంటూ సెల్ఫీ వీడియో తీసుకొని బ్రహ్మయ్య ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాడేపల్లి పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. భర్త చనిపోయిన ఏడాదికే ఇలా కుమారుడు కూడా ఆత్మహత్య చేసుకోవడంతో బ్రహ్మయ్య తల్లి కన్నీరుమున్నీరైంది. ఇష్టం లేకపోతే విడాకులు తీసుకుందామని చెప్పినా ఎందుకు ఇలా చేశావని ఆవేదన వ్యక్తం చేసింది. తన కుమారుడి చావుకు కారణమైన కోడలు, ఆమె ప్రియుడిని శిక్షించాలని డిమాండ్ చేసింది.

లైంగిక దాడి కేసులో వ్యక్తికి రిమాండ్

చీరాల: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి చీరాల కోర్టు 14 రోజులు జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు వన్‌టౌన్ ఎస్.ఐ జి.రాజ్యలక్ష్మి బుధవారం తెలిపారు. పట్టణంలోని ఓ మైనర్ బాలికపై అదే ప్రాంతానికి చెందిన పుల్లేటికుర్తి పుల్లయ్య అనే వ్యక్తి లైంగిక దాడికి ప్రయత్నించినట్లు సదరు బాలిక మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తులో భాగంగా ఎస్‌ఐ జి.రాజ్యలక్ష్మి బుధవారం ఉదయం నిందితుడిని ఇంటి వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఐకార్ విశ్రాంత శాస్త్రవేత్తలతో చర్చా కార్యక్రమం



వ్యవసాయ బులెటిన్‌ను విడుదల చేస్తున్న ఐకార్ విశ్రాంత శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదజయలక్ష్మిదేవి అధ్యక్షతన ఐకార్ (ఐసీఏఆర్) విశ్రాంత శాస్త్రవేత్తలతో విశ్వవిద్యాలయం పరిధిలోని విద్యార్థులు, శాస్త్రవేత్తలతో చర్చా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నగర శివారుల్లోని లాంఫాంనందున్న విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐకార్ విశ్రాంత శాస్త్రవేత్తలైన ప్రధాన శాస్త్రవేత్త (ఇక్రిశాట్) డాక్టర్ ఎస్ఎన్ నిగం, డైరెక్టర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్) డాక్టర్ డీఎం హెగ్డే, ఐకార్ ఏడీజీ డాక్టర్ బీబీ సింగ్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా వ్యవసాయంలో నేల ఆరోగ్య పరిరక్షణ అనే వ్యవసాయ బులెటిన్‌ను రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది వినియోగించుకునేందుకు వీలుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎన్ నిగం మాట్లాడుతూ వివిధ పంటల రకాల రూపకల్పనలో ఆధునిక పద్ధతులతోపాటు సంప్రదాయ విధానాలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. పరిశోధనలలో సరైన ప్రణాళికలు ముందుగానే రూపొందించుకుని చేయటం వల్ల ఆశించిన ఫలితాలను సులువుగా సాధించవచ్చన్నారు. వివిధ పంటల్లో బ్రీడింగ్ విధానాలు, విత్తన ఉత్పత్తి తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, కమ్యూనిటీ సైన్స్, ఏపీజీసీ శాస్త్రవేత్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20వ తేదీల్లో 52వ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అండర్-11 నుంచి అన్ని విభాగాలతోపాటు మాస్టర్స్ విభాగంలో 35 + నుంచి 70 + వరకు పోటీలు ఉంటాయన్నారు. విజయాలు సాధించిన వారిని విభాగాలుగా రాష్ట్ర పోటీలకు పంపిస్తామని తెలిపారు. అనంతరం పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శ్రీనివాసరావుతోపాటు రమేష్, వెంకటేశ్వరరావు, సతీష్ చంద్ర, రాము, రమేష్, కోచ్ బాషా ఆవిష్కరించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు వేతనాలివ్వాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీలు ముగిసిన 45 రోజుల తరువాత సైతం కొంత మంది ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించకపోవడం సరికాదని, వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ .. ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ బదిలీల్లోని అసంబద్ధ అంశాలు తొలగించి, సవరణ ఉత్తర్వులు కోరుతూ అనేక మంది ఉపాధ్యాయులు పెట్టుకున్న గ్రీవెన్స్‌ను త్వరగా పరిష్కరించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం .కళాధర్ మాట్లాడుతూ మెగా పీటీఎం విట్నెస్‌పై ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి మరీ విద్యాశాఖాధికారులు సమాచారాన్ని సేకరించడం పట్ల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, ఎండీ షకీలా బేగం, టి.ఆంజనేయులు, కె.కేదార్‌నాథ్, కె.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ



కారులో ఇరుక్కున్న వ్యక్తిని బయటకు తీసేందుకు యత్నిస్తున్న దృశ్యం



ప్రమాదంలో గాయపడిన మహిళ

ఒకరు మృతి, నలుగురు మహిళలకు గాయాలు

తాడికొండ: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యక్తి దుర్మరణం చెందాడు. నలుగురు మహిళలు గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండల పరిధిలోని నిడుముక్కల గ్రామంలో బుధవారం జరిగింది. వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి అమరావతికి మ్యారేజ్ బ్యూరోకు సంబంధించిన నలుగురు మహిళలతో కారు వెళుతోంది. అమరావతి నుంచి గుంటూరు మరో కారు వస్తోంది. కళాజ్యోతి కార్యాలయం వద్దకు రాగానే ఎదురెదురుగా ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మొదటి కారు డ్రైవర్ విజయవాడ యనమలకుదురుకు చెందిన పి.నాగేశ్వరరావు (38) మృతి చెందాడు. నలుగురు మహిళలు తీవ్రగాయాల పాలై స్పృహ తప్పి పడిపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. సీఐ వాసు, సిబ్బంది సహకారంతో నాగేశ్వరరావును మృతదేహాన్ని బయటకు తీశారు. మరో వాహనంలో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. వారంతా పెదకూరపాడు ఎమ్మెల్యేకు చెందిన బంధువులుగా సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

నకిలీ ధ్రువీకరణ పత్రంతో మోసం

దంపతులపై కేసు నమోదు

పెదకాకాని: ప్రభుత్వ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ధ్రువీకరణ పత్రం తయారు చేసినట్లు మండలం పరిధి వెంగళరావునగర్‌కి చెందిన కూరాకుల వాసుదేవ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూరాకుల సత్యనారాయణ, అనూష దంపతులపై మోసం, నకిలీ పత్రాల తయారీ కేసు నమోదు చేశారు. తమ ఇంటిని విక్రయిస్తామని సత్యనారాయణ దంపతులు చెప్పడంతో 2023లో రూ.15 లక్షలు వారికి ఇచ్చినట్లు వాసుదేవ్ ఫిర్యాదు చేశారు. మిగిలిన రూ.18 లక్షల మొత్తాన్ని రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించేందుకు ఒప్పందం జరిగింది. బ్యాంకు లోన్ కోసం సదరు ఇంటి సంబంధిత పత్రాలతో వాసుదేవ్ దరఖాస్తు చేసుకున్నప్పుడు సర్వే సర్టిఫికెట్ అవసరమైంది. సత్యనారాయణ ఇచ్చిన సర్టిఫికెట్‌ను నకిలీదిగా పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్ తేల్చారు. సహదేవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బుధవారం పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.